
# గంగమ్మతల్లి సాక్షిగా

డా॥ కె. సుభాషిణి



జూన్ నెల అయిపోతూ వచ్చినా ఒక్క చినుకు కూడ రాలలేదు. ఉదయం తొమ్మిదికే ఎండ చిటచిటలాడుతోంది.

"అబ్బా... ఏం ఎండలే ప్రసన్నా... ఒక్క వాన గూడ పళ్ళేదు ఇంతవరకు... మన్నాడు, గంగమ్మను చేసుకున్యాకనే యింగ వానలు పడేది" చెమటతో పాటు ముక్కు మీదికి కారిన కుంకుమను చేత్తో తుడుచుకొని గంపలకు రాసింది లచ్చమ్మ.

బట్టలు కాల్చిన బూడిద నూనె పూసిన గంపలు కావడంతో నల్లగా నిగనిగలాడుతుండాయి.

''గంగమ్మను చేసుకుంటున్నాం... బియ్యం, బ్యాళ్ళు యిమ్మని యిప్పుడు ఎన్నిండ్ల కాడికి పోయి అడగాల జేజి...''

''మనం బట్టలుతికే వాళ్ళ యిండ్లల్లోనే అడిగేది. ఓ పంజెయ్యి నువ్వు సుభద్రమ్మ యింటికాడికిపో సుజాత కూడా రేపే హైదరాబాద్‌కు పోతాదో ఏమో నేను వచ్చేవరకు ఆన్నే వుండు'' మనుమరాలికి చెప్పి పక్క వీధిలోకి దారితీసింది.

ప్రసన్న అయిష్టంగానే సుభద్రమ్మ యింటికి పోయింది. ఈమె పోయేటప్పటికి సుజాత మంచం మీద పడుకొని టి.వీ. చూస్తోంది.

''కడుపు నొప్పి తగ్గిందా సుజాత? గోడకు ఆనుకొని నిలబడి మెల్లగా అడిగింది.

''ఆ... తగ్గింది ప్రసన్నా రేపు రాత్రికి హైద్రాబాద్‌కి పోతున్నానే''

సుజాత చిన్నప్పటి నుండి ఖరీదైన హాస్టల్‌లో వుండి చదువుకుంటే ప్రసన్న సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో వుండి చదువుకుంది. సెలవుల్లో వూరికి వచ్చినప్పుడు యిద్దరు కలిసి ఆడుకునే వాళ్ళు. ఆటల్లో సుజాతను రావే పోవే అని పిలిచేది. యిప్పుడు సుజాతను తను అలా పిలవలేకపోవడం ప్రసన్న గమనించింది.

''ఇస్త్రీ బట్టలు తెచ్చినారేమే'' వంటింట్లో నుండే కేకపెట్టింది సుభద్రమ్మ''.

''మా యబ్బ తెస్తాడంటమ్మ'' బదులిచ్చింది.

''సర్లేగాని దొడ్లో సుజాత యిడ్సేసినేటివి బట్టలు వుండాయి అవి రెండు అట్ల పిండేసి మిద్ది మీద ఆరెయ్యి తొందరగా ఆర్తాయి''.

ఆ మాటలు వింటూనే ప్రసన్న ముడుచుకుపోయింది. భారంగా అక్కడి నుండి కదిలింది.

ఒక్కొక్క బట్టతీసి నీళ్లల్లో నానపెడుతోంది అవి మైల బట్టలని అప్పుడు గమనించింది. జుగుప్సగా అనిపించి కళ్ళు మూసుకుంది. తన మైల బట్టలు తప్ప వేరే వాళ్ళ మైల బట్టలు ప్రసన్న యింతవరకు ముట్టుకోలేదు. అందులోనూ తన ఈడు పిల్ల సుజాత బట్టలు వుతకాల్సిరావడం భరించలేకపోతోంది.

''సుజాతకు కడుపునొప్పని ఈ మూన్నాళ్ళు హాస్టల్‌లో కష్టమని పిల్చుకొచ్చినాడు వాళ్ళ నాయన బానేవుంది. మరి తనకు కూడా నెల వచ్చినప్పుడు విపరీతమైన కడుపు నొప్పి వుంటుంది యిట్ల సుజాత లెక్క పండుకోనీకె అయితాదా నోరు మూసుకుని బట్టలుతకాల్సిందే. ఈ దరిద్రమంతా వుతకాల్సిందే. ఏం ఖర్మ పట్టింది నాకు. నన్ను కాలేజిలో చేర్పించకపోవడం వల్లనే కదా ఈ పనులు చేయాల్సి వచ్చింది మనసులో ఏడ్చుకుంది.''

పైన బట్టలు ఆరేసి కిందికి దిగి వస్తుంటే ప్రసన్నకు వాళ్ల జేజి గొంతు వినిపించింది.

''మన్నాడే రెడ్డెమ్మ గంగమ్మను జేస్తాండేది యిన్ని బియ్యం, బ్యాళ్లు పెట్టు తల్లి నీకు తెలదు అని కాదు గాని అడగడం నా ధర్మం కదమ్మా''

కొద్దిసేపటి తర్వాత చేతిలో చాటపట్టుకొని లచ్చుమ్మ దగ్గరికి వచ్చింది. బియ్యం, టెంకాయ, ఆకువక్క, ఇరవైరూపాయల నోటు వున్న చాటను, బ్యాళ్ళ గిన్నెను లచ్చుమ్మ చేతిలో పెట్టింది.

''మేమిచ్చేదాండ్లతో గంగమ్మను చేసుకోవడం మీకు కావాల్సినవి ఆ తల్లిని కోరడం ఆహా మొత్తానికి మీ పనే హాయిగా వుందే లచ్చుమ్మ సరేలే ఓ టెంకాయ యిస్తాను మా తరుపున కొట్టండి యింగో మాట మా సుజాత గనక మంచి మార్కులు తెచ్చుకుని ఇంజనీరింగ్‌లో చేరితే గంగమ్మకు యాట కొడ్తానే ఆ యాట మీకే యిస్తాంలే''.

వాళ్ళమ్మ మాటలకు సుజాత ముసిముసి నవ్వులు నవ్వింది.

పెద్ద గంపలో బియ్యం, చిన్నగంపలో బ్యాళ్ళు పోసుకుంది లచ్చుమ్మ. డబ్బులు బొడ్లో దోపుకుంది. బియ్యం గంపనుమోయమని ప్రసన్నకుయిచ్చింది. పోతున్నామమ్మో అంటూ కేక పెట్టింది.

''లచ్చుమ్మ వుండు వస్తున్నా'' అంటూ చేతిలో కొత్తచీర, జాకిట్టుతో బయటికి వచ్చింది.

''మా సుజాత తరుపున యిస్తున్నా గంగమ్మకు పెట్టుకోండ్రి'' వాటిని చూస్తూనే లచ్చుమ్మ ముఖం వెలిగిపోయింది. ప్రసన్న ముఖం కళ తప్పింది.

***

మామూలుగా అయితే ముసలి వాళ్ళ దగ్గు, వాళ్ళ మూలుగులుతప్ప మనుషుల అలికిడే విన్పించని ఆ వీధిలో ఆ రోజు పిల్లల అల్లరి ఎక్కువగా వుంది. ఆడవాళ్ళయితే ముందు రోజు సాయంకాలం నుండి రెండు కాళ్ళు ఒక్క దగ్గర పెట్టకుండా పనులు చేస్తూనే వున్నారు. సున్నాలు పూసుకొని యిళ్ళు తుడుచుకున్నారు. ఎర్రమట్టితో పొయ్యిలు అలుక్కున్నారు. వాడనివి, వాడేటివి, ఎత్తిపెట్టిండే గిన్నెలు, చెంబులు, తట్టలు అన్నీ శుభ్రంగా కడిగి తుడిచి పెట్టుకున్నారు. ఇండ్ల ముందర పెండతో అలికి ముగ్గులు వేసుకున్నారు.

రాత్రి పొద్దుపోయి పడుకున్నా కూడా మళ్ళీ చీకట్లోనే లేచి నీళ్ళు తెచ్చుకొని, తలస్నానాలు చేసి వంట మొదలు పెట్టినారు. పులగం, వంకాయ కూర వండినారు. ఏ పండుగ రోజైనా కూడా ఎలాంటి పిండివంటలు వండుకోలేని పరిస్థితి వీళ్ళది. బట్టలు వుతికే యిండ్లల్లో పండుగ పూట వాళ్ళు చేసిండేటివి పెడితే తెచ్చుకొని తినడం మాత్రమే వీళ్లకు తెలుసు.

గంగమ్మకు భక్ష్యాలు నైవేధ్యం పెట్టడానికి శెనగ బేడలు వుడకబెట్టి, బెల్లం వేసి, పూర్ణం రుబ్బి పెట్టుకున్నారు. ఇప్పుడు కూడా 'గంగమ్మను చేసుకుంటున్నాము అని చెప్పి తెచ్చుకున్న బేడలే' అవి.

పిల్లలు పొయ్యి దగ్గర నుండి పక్కకు పోవడం లేదు. భక్ష్యాలను కాలుస్తుంటే చూసుకుంటూ గుటికలు మింగుతూ ఆ తియ్యటి వాసనను పీల్చుకుంటూ ఆనందపడిపోతున్నారు.

''తొందరగా కానీయ్యండే.. ఎంతసేపు'' లచ్చుమ్మను తొందరపెట్టినాడు సాయన్న.

''ఇదిగో అయిపాయ... యింగటెంకాయగొట్టేది ఒక్కటే మిగిండేది... యింతకు తప్పెట గొట్టే మాదిగోళ్ళు వచ్చిండారా?

ల్యాకుంటే సాకలోళ్ళ దానికి కదా... ఏం తొందరలే అనుకొని తాక్కుంటా ఆ మధ్యలాల్నే యాడన్నా పడిపోయినారా... మమ్మల్ని ఊరకాడీకుండా... ముందాళ్ల సంగతి జూడండ్రి అబ్బాకొడుకులిద్దరు...'' లచ్చుమ్మ మొగున్ని కసురుకుంది. గొణుక్కుంటూ బయటికి పోతున్న సాయన్నను పిలిచి, ''వాళ్ల కోసం మళ్ళీ పోదువుగాని, ముందు కాళ్ళు, మొగం కడుక్కొని రా టెంకాయ కొడ్దువు''

అంతలోనే కోడలు వైపు తిరిగి

''అవ్..మయిశ్మరీ....ప్రసన్న యాడకు పాయనే'' అంటూ బయటికి తొంగి చూసింది.


రెండు చేతులు గడ్డం కిందపెట్టుకొని తను వేసిన ముగ్గును తదేకంగా చూస్తోంది ప్రసన్న.

''ఒక్కదానివి ఈడ ఏం జేస్తాండావురా?'' వాళ్ళ జేజి పిలుపుకు ఉలిక్కిపడి లేచింది.

''ఎన్ని గంట్లకు జేజి ఏటికాడికి పోయేది''

''పోవల్లా... ముందు తప్పెట్లు కొట్టుకుంటూ అందరి యిండ్లకాటికి మేకపోతును తోల్కపోవల్ల కదా''.

ప్రసన్న ఎప్పుడో ఐదో తరగతిలో వున్నప్పుడు గంగమ్మ చేసుకుండేది చూసినట్లు జ్ఞాపకం. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో వుండడంతో గంగమ్మను చేసేది చూసే



అవకాశం రాలేదు. ఏటికి పోయి అక్కడ ఏం చేస్తారో చూడాలని ఒక వైపు, పదో తరగతి మంచి మార్కులతో పాస్ అయినా కూడా కాలేజిలో చేర్పియ్యని ఘింట్లో వాళ్ళమీద కోపం, అలక యింకోవైపు పీకుతున్నాయి.

మహేశ్వరి కొడుకులిద్దరిని పిలిచి చెరో భక్ష్యం పెట్టి పులగం, వంకాయ కూర వేసి, తినమని చెప్పింది. ప్రసన్న పెద్దపిల్ల కావడంతో ఏం పెట్టలేదు. ఏటికి పోయి గంగమ్మకు పూజ చేసి మేకపోతును బలియిచ్చి యిళ్ళకు తిరిగి వచ్చేవరకు పెద్దవాళ్ళు ఎవ్వరు కూడా ఏమీ తినరు.

వీళ్ల తలలు దువ్వుకొని తయారు అవుతుండగానే మేకపోతును తెచ్చి వీళ్ళ యింటి ముందర కట్టేసినారు. వీధిలోని పిల్లలందరు దాని చుట్టు తిరుగుతూ కేకలు వేస్తున్నారు. వీళ్ళ అల్లరికి మేక బెదిరిపోయి మే...మే అని అరవడం మొదలు పెట్టింది. లచ్చుమ్మ పిల్లల్నందర్ని కసిరి పక్కకు పంపింది. మేకపోతును కడిగి, బొట్టుపెట్టి పూల దండలు వేసింది.

***

తప్పెట్లు కొట్టుకుంటూ రెండు కిలోమీటర్లు మేకపోతును వూరేగించుకుంటూ హంద్రీ దగ్గరకు వచ్చేసరికి సూర్యుడు నడినెత్తిమీదికొచ్చాడు.

హంద్రీలో నీళ్ళు చూస్తామంటే కూడా లేవు. మురికి నీళ్ళు మాత్రం చిన్నపాయగా పారుతున్నాయి. ఇసుక కోసం గుంతలు తవ్వడంతో ఏట్లో ఇసుక కన్న మట్టే ఎక్కువగా కన్పిస్తోంది.

ఏటి వడ్డున వేసిన పందిరి ముందర పెండ అలికి ముగ్గులు వేస్తున్నారు పెండ్లికాని ఆడపిల్లలు.

''పెద్దముగ్గు ఎయ్యే ప్రసన్నా... గంగమ్మ తల్లి నీకు మంచి మొగున్ని యిస్తుంది'' మనుమరాల్ని వుడికించింది లచ్చుమ్మ.

''సదువుకుంటాను కుయ్యో మొర్రో అని ఏడ్చి మొత్తుకున్నా వీళ్ళు యిని సావరుగాని మొగుడు మొగుడు అని పానాలు తోడేస్తారు'' మనసులో ఈసడించుకుంది. పైకి మాత్రం ''ఏస్తుండాను కదే జేజి.. అయినా మోడాలు జూడు కమ్ముకొని ఎట్లా వస్తాండాయో... వానగన్క వస్తే ఏసిందంత కొట్కపోతాది''

''వానలు పడాల అని అందరు కోరుతారు గదా పెద్దమ్మ? మన మొక్కరమేనా కోరుకుంటాండేది ఏమన్నా'' పత్తిని వొలిచి వత్తులు చేస్తున్న ఒకామె అడిగింది.

''అందరు కోరుకుంటారు సరే... కాని మనకత వేరేనే తల్లి. మన బత్కులు, పానాలు అన్ని గంగమ్మ తల్లితోనే ముడివన్యాయి. వానలు పడి ఏర్లు, వంకలు పారితేనే కదా మన సంసారాలు గడిసేది. అవి పారకుండా ఎండిపోతే మనము బట్టలెట్ల వుత్కుతాము. వుత్కకపోతే ఏం తింటామే'' ఇసుక, నల్లమట్టి రెండింటిని కలిపి ముద్ద చేస్తూ చెప్పింది.

''ఏం ఎల్లకాలం బట్టలుతికే బతకాలా? అందరి లెక్క సదువుకోగూడదా'' ప్రసనన తనమనసులో వున్న కోపాన్ని బయట పెట్టింది.

''అవే.. లచ్చుమ్మత్త ఈ బట్టలుతికే పని మన సాకళోళ్ళకే ఎందుకు పెట్టాల్నే'' మేనకోడలు వరుసయ్యే రాజేశ్వరి దిగులుగా అడిగింది.

''అట్టంటే ఎట్లనే రాయేశ్వరి భగమంతుడు రాసిందే రాతనే అది. పూర్యం మనోళ్ళకు ఏ పని సరింగా వచ్చేది గాదంట... మనల్ని ఎవ్వరూ పనులకు పిల్చేవోళ్ళు కాదంట... దాంతో తిండికి కూడా జరుగుబాటు అయ్యేది కాదంట... మలమల మాడి సచ్చే టోళ్ళంట... అప్పుడు దేవున్ని మాకు ఏదో ఒక దారి చూపిసామీ అని ఏడుకుంటే, దేవుడు ఆలోచించి... బిడ్డల్లారా దిగులు పడకండి... రైతులకు, పూజార్లకు వ్యాపారస్తులకు వాళ్ళ పనులు వాళ్ళకు మస్తుగుంటాయి... బట్టలు శుభ్రంగా వుతుక్కునేంత తీరిక వాళ్ళకుండదు. అందుకే వాళ్ళ బట్టలు శుభ్రంగా మల్లెపూల లెక్క మెరిసేట్టుగా వుతికే వరం మీకు యిస్తున్నాను''. అని చెప్తూ.. నీళ్ళకోసము ప్రతియేడు గంగమ్మకు పూజలు సేయండి యికనుండి వానే మీకు కులదేవత మిమ్మల్ని కాపాడేది కూడా వాననే అని చెప్పి గంగమ్మకు పూజ ఎట్ల సేయాల్నో, ఎప్పుడు సేయాల్నో చెప్పినాడంటసామి.. అట్ల ఆ పొద్దునుండి మన సాకలోళ్ళకు గంగమ్మతల్లి యింటి దేవత అయ్యింది'' మాట్లాడుతూనే కలిపిన నల్లమట్టి, ఇసుక ముద్దను బొమ్మలాగ చేసి ముక్కు, కండ్లు దిద్దింది. పసుపు పూసి కుంకుమ బొట్లు పెట్టింది. పూలతో అల్లిన బాసికం నెత్తిమీద వేసింది.

''అందరు కోరుకుంటారు సరే... కాని మనకత వేరేనే తల్లి. మన బత్కులు, పానాలు అన్ని గంగమ్మ తల్లితోనే ముడివన్యాయి. వానలు పడి ఏర్లు, వంకలు పారితేనే కదా మన సంసారాలు గడిసేది. అవి పారకుండా ఎండిపోతే మనము బట్టలెట్ల వుత్కుతాము. వుత్కకపోతే ఏం తింటామే'' ఇసుక, నల్లమట్టి రెండింటిని కలిపి ముద్ద చేస్తూ చెప్పింది.

విన్న కథే అయినా నిశ్శబ్దంగా విన్నారు. ప్రసన్న మాత్రం వూరికే వుండ లేకపోయింది.

''అంతేలే దేవుడు రాత రాసినాడని యిట్లనే మన మందరం మైల బట్టలు వుతుక్కుంటూ వుందాం. పెద్దోళ్ళందరు యాడో ఓ తిప్పలు పడి వాళ్ళ పిల్లోల్లను టౌన్లల్లో పెట్టి సదివిచ్చుకుంటాండారు. ఆ కాంతారావ్ బాపనయ్య కొడుకులకు మంత్రాలు నేర్పకుండా సదువు చెప్పిచ్చి టీచర్లను చేశా... కాపోళ్ళు కూడా ఏం తీసిపోలేదు సుజాతకు, నాకు యిద్దరికి మార్కులు ఒక్కటే వామెను తీస్కపోయి హైద్రాబాద్‌లో చేర్పిచ్చినారు. నన్నేమో వాళ్లమైల బట్టలుత్కడానికి కాలేజిలో చేర్పియ్యకుండారు'' దుఃఖంతో ప్రసన్న గొంతు పూడుకుపోయింది.

ప్రసన్నను చూస్తుంటే లచ్చుమ్మకు తెలియని భయమేదో కలిగితే చాలామందికి ఆ పిల్లమీద జాలి వేసింది.

''ఆ పిల్లను ఆమైనా గోడాడీకపోతే యాడన్నా కాలేజిలో చేర్పియ్యగూడదూ అత్తా''.

''ఏమోలే దాని రాత ఎట్టుంటే అట్ల జరుగుతాది''.

ప్రసన్నకు వెర్రి కోపం వచ్చింది.

''చేసేది చేస్తా... మళ్ళీ రాత ఎట్టుంటే అట్ల జరుగుతాదా... ఎవరే రాసిండేది రాత'' ముగ్గుకు రంగులు వేయడం ఆపి దిగ్గున లేచింది.

''నోర్మూయ్...దయ్యం గాని పట్టిందా నీకు యియ్యాళ... గంగమ్మ తల్లిని ఎదురుగ్గా పెట్టుకొని నోటికి ఎంత వస్తే అంత అనడమేనా, కండ్లు, మిండ్లు కాంద్రాక సస్తాండావ్''

అంతమందిలో తిట్టేసరికి, ప్రసన్నకు కండ్లల్లో నీళ్ళు పొంగాయి.

''ఊ... సర్లే చూసినాం గాని ముందు ఆ ఏడుపు ఆపీ ఆ చీర రయిగ్గడ్డ యిట్లియ్యి''

కళ్ళు తుడుచుకొని బుట్టలో నుండి చీర, జాకిట్టు తీసి యిచ్చింది. సుభద్రమ్మ అన్న మాటలు గుర్తుకు వచ్చి విరక్తిగా నవ్వుకుంది. మనసులో ఏవో లెక్కలు వేసుకుంది గాని అంచనాకు రాలేకపోయింది.

''అవ్ పెద్దమ్మా... గంగమ్మను చేసుకోడానికి మనము యింటికి తలా ఎంత డబ్బులు ఏసుకుందాం'' ఆరా తీసింది.

''యింటికి ఐదొందలు దారపడింది. యింత జేస్తే యింటికి కేజిన్నర కూర వస్తుంది. పందిరికి, తప్పెట్లు గొట్టేవాళ్ళకు, వాళ్ళు తాగడానికి యిట్ల పై ఖర్చులకే ఎక్కువయితాది''

''యిదల్లా మన చేతుల్నుండి ఏసుకోవాల్సిందేనా''

''మరి యింగెట్ల అనుకుండావే''

''బియ్యం, బ్యాళ్లతో పాటు వాళ్ళిచ్చేపైసలే అయితాయి అనుకున్నా... మరి ఆ సుభద్రమ్మ అట్ల అంటేనూ'' దీర్ఘం తీసింది.

మళ్ళీ తనే

''వాళ్ళిచ్చే దాంతో మనము గంగమ్మను చేసుకొని కోరికలు కోరుకుంటామంట'' సుభద్రమ్మ ఏం అనిండేది వాళ్ళకు చెప్పింది.

''సర్లే ఆ మాటలన్ని పట్టిచ్చుకుంటే యింగ మనం బతికి నట్లే'' లచ్చుమ్మ సర్ది చెప్పబోయింది.

ప్రసన్న వాళ్ళ జేజి మాటలు వినదల్చుకోలేదు.

''పట్టిచ్చుకోవాల్సింది నీ మాటలు కాదు. ఆ సుభద్రమ్మ మాటలే మన డబ్బులు ఖర్చు పెట్టుకొని గంగమ్మను చేసుకుంటాండామ్... ఎందుకు? ఆళ్ళ బట్టలు నీటుగా వుత్కడానికి కావాల్సినన్ని నీళ్ళు వుండాలని మొక్కుకుంటామ్... సామ్మొక్కడిది సాకొకడిది అంటే యిదే'' ప్రసన్నను మధ్యలోనే ఆపింది రాజేశ్వరి.

''చిన్న దానివైనా ఎంత కరెక్టుగా చెప్తాండావే నీకు యింకొక సంగతి తెల్సినట్లు లేదు. మనూరి పెద్ద శెట్టికాడ మీ జేజివి రాళ్ళ కమ్మలు కుదువబెట్టి ఐదొందలు డబ్బులు తెచ్చుకున్నారు. మూడు రూపాయల వడ్డీతో ఆ డబ్బులతోనే యిప్పుడు గంగమ్మను జేస్తాండేది అసలు, వడ్డీ అంతా పట్టుకొని మిగిలిన జీతం సంవత్సరం ఆఖర్లో యిస్తాడు శెట్టి''.

రాజేశ్వరి చెప్పింది విని అవాక్కయ్యింది ప్రసన్న. లచ్చుమ్మ బోసి చెవుల్ని అప్పుడు గమనించింది.

''ఆ డబ్బుల్తో నన్ను కాలేజిలో చేర్పిచ్చి వుండొచ్చుగదే.. ఎట్ల హాస్టల్ కూడా వుంది. ఈ మైల

బట్టలు వుత్కడం కంటే ఆ పురుగులన్నం, నీళ్ళ సాంబారే మేలు. హాస్టల్‌లో మాకు ముట్టు వచ్చినప్పుడు బట్టలు వాడము తెలుసా స్కూల్ వాళ్ళు మాకు ప్యాడ్స్ యిస్తారు అవే వాడ్తాము... ఇప్పుడు మాత్రం వీళ్ళ మైల బట్టలు వుతకాల్సి వచ్చింది. పైగా వాళ్ళ యిండ్లకాడికి పోయి వాళ్ళు యిడిసేసిన బట్టలు మూట గట్టుకొని, మోసుకుంటూ యింత దూరం రావల్ల. నీళ్లల్లో నానినాని కాళ్ళు చేతులు చేప పొలుసులు లెక్క అయిపోతాండాయి... ఆహా ఏం సుఖపడ్తాండామే ఈ సుఖాలన్నీ మాకు కలకాలం వుండాల అని గంగమ్మకు మొక్కుకుంటాండామ్ ఏం బత్కులే మనవి'' ప్రసన్న కళ్ళల్లో నుండి నీళ్ళు దారాపాతంగా కారుతున్నాయి. శబ్దం పైకి రాకుండా ఏడుస్తోంది.

మనుమరాల్ని వోదార్చడానికి లచ్చుమ్మకు ధైర్యం చాలడం లేదు. పక్కకు తిరిగి కళ్ళు తుడుచుకుంటున్న కోడల్ని చూసేసరికి లచ్చుమ్మకు గుండె పిండినట్లయ్యింది. నిరుత్సాహంగా అక్షింతలు కలిపింది.


కుమిలి కుమిలి ఏడుస్తున్న ప్రసన్నను చూస్తుంటే రాజేశ్వరికి కడుపులో దేవినట్టయ్యింది. ప్రసన్న పక్కనే కూలబడింది. ఓదార్పుగా భుజం మీద చేయి వేసి మెల్లగా తట్టింది. ఏడుపు తగ్గకపోగా వెక్కిళ్ళ రూపంలో ఎక్కువయ్యింది.

''ఏడ్సద్దే ఎంత ఏడ్సినా మన సాకలోళ్ళ బతుకు యింతేనే ఎవరో ఒకరిద్దరికి తప్ప మనకు సుఖపడే రాతలేదు. మనోళ్ళు మారరు మా పెద్దోళ్ళ లెక్కనే మేము మా లెక్కనేమీరు మళ్ళీ మీ పిల్లోళ్ళు ఇంతే'' గట్టిగా ఊపిరి పీల్చుకోడానికి ఆగింది. ''దేవుని దయ వుంటే ఎంతసేపే'' లచ్చుమ్మ తోటికోడలు వేదాంతం చెప్పింది.

''కాని ఆ దేవునికే మనము బాగుపడాలని లేదు. యింగ మన గురించి, మన బాగు గురించి ఆలోచించేటోళ్ళు ఎవరు? ఎంత సేపు దోబిగాట్లు కట్టి స్తామ్ ఇస్త్రీపెట్టలు యిస్తాము అని పొద్దాకులు వూదర గొడ్తాంటారు దానికి తోడు ఆ సుభద్రమ్మ అట్టాంటోళ్ళు వాళ్ళ పిల్లోళ్ళు బాగా చదువుకుంటే గంగమ్మకు చీరల్నిస్తామ్ యాటకొడ్తామంటూ మనల్ని వుబ్బిస్తారు. దాండ్లకు ఆశపడి మన పిల్లోల్ల సదువులు గంగలో కలుపుతాండామే... హు మనకి తెలివి ఎప్పుడొస్తుందో'' తల పట్టుకుంది రాజేశ్వరి.

చెట్టుకు కట్టేసిన మేకపోతును కట్లు విప్పి బలి యివ్వడానికి తీసుకొస్తున్నారు. తప్పెట్ల శబ్దానికి, మేక అరుపులకు అందరు అటువైపు చూశారు. లచ్చుమ్మకు ప్రసన్న ఏడుపు తప్ప అవేవి విన్పించడం లేదు. గంగమ్మ మాత్రం వులుకు పలుకు లేకుండా నిశ్చలంగా వుంది.

★



## అది పునర్జన్మే!

ఉదయం పదిగంటల సమయం. ట్రైన్ షాట్ అది. డైరెక్టర్ ఓకే చెప్పినట్టే మూవింగ్ ట్రైన్ పట్టుకుని వేలాడుతూ వెళుతున్నా. ఉన్నట్టుండి పట్టు తప్పింది. పట్టాల మధ్యలో పడిపోయా. ఇక నా పని అయిపోయిందనుకున్నా. కానీ నాకు ఇలలో మరిన్ని సినిమాలు తీయాలని రాసిపెట్టి వున్నట్లుంది అంటూ తనకు పునర్జన్మ వచ్చినట్టేనని చెబుతోంది అయేషా టకియా. నగేష్ కుకునూర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న 'డర్' సినిమా షూటింగ్ సందర్భంగా అయేషా తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న తరువాత ఈ మాటలంది. అయితే డూప్‌లేకుండా ఈ సాహసం చేయడం అంత మంచిది కాదని తెలిసొచ్చింది పాపం అయేషాకి. మొత్తమ్మీద అయేషా వెంటనే షూటింగ్‌లో పాల్గొనింది.